క్లుప్తంగా

విరాళం అందజేత



మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలో బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన కోసం న్యాయవాది వంగ నాగేశ్వర్‌రావు రూ.1,11,160, ఆయన సోదరుడు వంగ శ్రీనివాస్ రూ.1,11,160 వేణుగోపాలస్వామి వారి దేవాలయంలో మున్సిపల్ చైర్మన్ రాంమోహన్ రెడ్డి, కమిటీ సభ్యులకు విరాళాలను అందజేశారు. అదేవిధంగా ఉమ్మడి వరంగల్ జిల్లా రిజిస్ట్రార్, టీజీఓ జిల్లా అధ్యక్షుడు హరికోట్ల రవి రూ.2,00,016 అందజేశారు.

నేడు జాబ్‌మేళా

మహబూబాబాద్: కలర్ స్కై టెక్నాలజీస్ సంస్థ సహకారంతో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 28న జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ, డిప్లమా, ఇంటర్, డిగ్రీ పోస్టు గ్రాడ్యుయేట్ పూర్తి చేసిన నిరుద్యోగులు శనివారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు హాజరు కావాలని కోరారు. పూర్తి వివరాల కోసం హెచ్‌ఆర్ గోపి కిరణ్ 95021 95245 నంబర్ సంప్రదించాలని కోరారు.

సందేహాలను నివృత్తి చేసుకోవాలి

మహబూబాబాద్: కార్మికులు ప్రావిడెంట్ ఫండ్‌పై ఉన్న సందేహాలను నివృత్తి చేసుకొని అవగాహన కలిగి ఉండాలని మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి కోరారు. ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ రీజినల్ వరంగల్ కార్యాలయం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ప్రావిడెంట్ ఫండ్, నిధి ఆప్కే నికట్ అనే దానిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ మేనేజర్ శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

చాదర్ ఊరేగింపు



మహబూబాబాద్ రూరల్: హజ్రత్ ఖాజా గరీబ్ నవాజ్ 811వ ఉర్సును పురస్కరించుకుని మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో శుక్రవారం చాదర్ ఊరేగింపు కార్యక్రమం బ్యాండ్ వాయిద్యాలతో ఊరేగించారు. స్థానిక కంకరబోర్డు నవ్ జవాన్ కమిటీ ఆధ్వర్యంలో స్వర్గీయ షేక్ అలీ ఇంటి నుంచి చాదర్ ఊరేగింపు ప్రారంభించారు. కార్యక్రమంలో షేక్ ఆసీఫ్ అలీఫకీర్, సయ్యద్ జాకీర్‌హుస్సేన్, యాకుబ్, మతిన్, అక్రం పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులను నడపాలి

కేసముద్రం: కేసముద్రం నుంచి, తొర్రూరు, గూడూరు మండలాల వైపునకు ఆర్టీసీ బస్సులను నడపాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. దయ్యాల కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి సలీం, ఎల్లయ్య, బిచ్యానాయక్, సూరయ్య, వెంకన్న పాల్గొన్నారు.

వసతి గృహాన్ని కేటాయించాలి

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలో ప్రస్తుతం ఉన్న ఎస్టీ బాలుర జూనియర్ కళాశాల వసతి గృహం ఇరుకుగా ఉన్నందున విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే పాత కలెక్టర్ కార్యాలయంలో ఉన్న ఒక భవనాన్ని ఏర్పాటు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ కార్యదర్శి గుగులోత్ సూర్యప్రకాష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయ అధికారి ఎర్రయ్యకు ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు సింహాద్రి, ప్రవీణ్, వినోద్, లక్ష్మణ్, అశోక్, ఉపేందర్ పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి

మహబూబాబాద్: గర్భిణులు, బాలింతలు, శిశువుల అభ్యున్నతికి ఏర్పాటు చేసిన ఐసీడీఎస్‌ల పరిరక్షణ కోసం పాటుపడాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఉపేందర్ అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి సరోజ పిలుపునిచ్చారు. సీఐటీయూ దాని అనుబంధ అంగన్‌వాడీ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని లేనిఎడల వచ్చే నెల 1,2,3 తేదీల్లో మూడు రోజులు సమ్మె నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మల్లయ్య, సరోజ, హిమబిందు, మంగమ్మ, రజిని, సరోజ, తదితరులు పాల్గొన్నారు



మహబూబాబాద్: ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు

డోర్నకల్: అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా నాయకులు దాసరి మల్లేశం డిమాండ్ చేశారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట శుక్రవారం అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ధర్నా నిర్వహించారు. దాసరి మల్లేశం మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తాళ్లూరి పద్మ, అంబటి విజయ, సుజాత, కృష్ణకుమారి, వసంతలక్ష్మి, నీలాదేవి తదితరులు పాల్గొన్నారు.



డోర్నకల్: ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

సమస్యలు పరిష్కరించాలని ఆందోళన

మహబూబాబాద్: భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజు డిమాండ్ చేశారు. సీఐటీయూ అనుబంధ తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని జిల్లా కేంద్రంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేసి కార్యాలయంలో వినతి అందజేశారు. ఈసందర్భంగా ఆకుల రాజు మాట్లాడుతూ.. కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి భవన నిర్మాణ కార్మికులకు లక్ష మోటార్ సైకిళ్లు ఉచితంగా అందిస్తామని ప్రకటించి నేటికి అమలు చేయలేదన్నారు. అసెంబ్లీ సాక్షిగా ప్రకటించి ఆ విషయం విస్మరించడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డు సలహా సంఘాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. 55సంవత్సరాలు దాటిన భవన నిర్మాణ కార్మికులకు పింఛన్ రూ.5వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉప్పలయ్య, శ్రీశైలం, కోటేశ్వర్‌రావు, రాజమౌళి, నాగన్న, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

నాన్‌టీచింగ్ వర్కర్ల వేతనాలు పెంచాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సిబ్బంది

కురవి: కేజీవీబీ పాఠశాలలో పనిచేస్తున్న నాన్‌టీచింగ్ వర్కర్స్ వేతనాలను పెంచాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బిల్లకంటి సూర్యం డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని నేరడ గ్రామంలోని కేజీవీబీ పాఠశాలలో చలో హైదరాబాద్ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈనెల 30న హైదరాబాద్‌లో జరుగు ఆందోళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాన్‌టీచింగ్ సిబ్బంది రాజేశ్వరి, విజయ, నాగమణి, రమణ, వరలక్ష్మి, స్వరూప, మహేశ్వరి పాల్గొన్నారు.

ఒత్తిడి, భయాన్ని విడిస్తేనే విజయం

మహబూబాబాద్ అర్బన్: పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడిని, భయాన్ని విడిచి ధైర్యంగా పరీక్షలు రాసినప్పుడు విజయాలు సాధిస్తారని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జాటోత్ హుస్సేన్ నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో శుక్రవారం ప్రధాన మంత్రి మోదీ 'పరీక్షా పే చర్చా' కార్యక్రమం ఆన్‌లైన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఒద్దిరాజు రామచంద్రరావు, నాయకులు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, నవీన్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

గార్ల: ప్రధాని నరేంద్రమోదీ టీవీల్లో దేశవ్యాప్తంగా చేపట్టిన 'పరీక్షా పే చర్చా' కార్యక్రమం శుక్రవారం గార్ల హైస్కూల్లో విద్యార్థులు టీవీలో వీక్షించారు. కార్యక్రమంలో బీజేపీ మైనారిటీ మోర్చా కార్యదర్శి రావుక విమల్‌కుమార్ జైన్, పార్టీ మండల అధ్యక్షుడు జశ్వంత్ ఠాకూర్, దేవా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మహబూబాబాద్ అర్బన్: మాట్లాడుతున్న జాటోత్ హుస్సేన్ నాయక్

సెకండ్ ఏఎన్‌ఎంల నిరసన



కేసముద్రం: మాట్లాడుతున్న జయరాజ్

కేసముద్రం: సెకండ్ ఏఎన్‌ఎంలను రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ మండల కార్యదర్శి జల్లె జయరాజ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని కేసముద్రంవిలేజ్‌లో గల కంటివెలుగు కార్యక్రమంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఏఎన్‌ఎంలు జయ, ప్రేమలత, సుజాత, రజిత, నాయకుడు అఫ్జల్ పాల్గొన్నారు.

చిన్నగూడూరు: మండలకేంద్రంలోని ఆరోగ్య ఉప కేంద్రంలో పలువురు ఏఎన్‌ఎంలు శుక్రవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఉద్యోగ భద్రత కలిపించి రెగ్యులరైజ్ చేయాలని కోరారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

గూడూరు: ప్రతీ ఒక్కరు ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధి, శిక్షణ, నైపుణ్యాలను సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ గుగులోతు సుచిత్ర అన్నారు. మండల కేంద్రంలోని సరయు డిగ్రీ కళాశాలలో శుక్రవారం నాక్ సంస్థ ద్వారా శిక్షణ పొందిన 25 మంది భవన నిర్మాణ కార్మిక మహిళలకు ఉచితంగా అందించిన కుట్టు మిషన్లను ఆమె పంపిణీ చేశారు. నాక్ ఏడీ గోలి రమేష్ అధ్యక్షతన వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చెల్పూరు వెంకన్న, లక్ష్మణ్‌రావు, సాయిలు, ఉప్పలయ్య, కుట్టుమిషన్ ట్రైనర్ బుర్ర మమత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యురాలు సుచిత్ర

ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణం సురక్షితం

నెల్లికుదురు: ఆర్టీసీ బస్సుల్లోనే సుఖవంతమైన ప్రయాణం సాధ్యమని మహబూబాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ విజయ్ ప్రజలను కోరారు. మండలంలోని మునిగలవీడు గ్రామంలో సర్పంచ్ నల్లాని నవీన్‌రావు ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామ పంచాయతీ ఆవరణలో ప్రజలవద్దకే ఆర్టీసీ బస్సు సేవల కార్యక్రమం నిర్వహించారు. మహబూబాద్ నుంచి సింగారం, బొజ్జన్నపేట మీదుగా మునిగలవీడుకు మానుకోట డిపో నుంచి రోజుకు నాలుగు ట్రిప్పులు, మహబూబాబాద్ నుంచి మునిగలవీడు మీదుగా తొర్రూరుకు బస్సు సర్వీసు నడిచేవిధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డిపో కంట్రోలర్ చారి, ఎంఎస్‌రెడ్డి, ఉపసర్పంచ్ మంగయ్య పాల్గొన్నారు.

బాలికా విద్యాభివృద్ధికి కృషి చేయాలి

గూడూరు: ఆశ్రమంలో నాణ్యమైన రుచికరమైన భోజనం పెడుతూ బాలికల విద్యాభివృద్ధికి కృషి చేయాలని తహసీల్దార్ అశోక్‌కుమార్ అన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లి జీపీలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా వంటశాలలో తయారు చేస్తున్న వంటలను పరిశీలించారు. బాలికలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని ప్రిన్సిపాల్ వసంతకు సూచించారు.

ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులకు అన్యాయం

మహబూబాబాద్ అర్బన్: ఉపాధ్యాయుల పదోన్నతుల విషయంలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల మెరిట్‌ను అణచి, కేవలం ఎస్సీల, ఎస్టీల రిజర్వేషన్ 15శాతం, 6శాతం పరిమితం చేస్తున్నారని, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు చాగంటి ప్రభాకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఉపాధ్యాయుల బదిలీల, పదోన్నతుల ప్రభుత్వ బాలుర పాఠశాల వద్ద శుక్రవారం సంఘం నాయకులు నిరసన చేశారు. అనంతరం బాంసెఫ్ రాష్ట్ర నాయకులు బానోత్ సోమ్లా నాయక్, జిల్లా నాయకులు విద్యాసాగర్ లు మాట్లాడుతూ.. 79శాతం ఓపెన్ కేటగిరిలోకి ఎస్సీ, ఎస్టీ వర్గాలకు అవకాశాలు కల్పించకపోవడం, రిజర్వేషన్లకు, సామాజిక స్ఫూర్తికి వ్యతిరేకమన్నారు. కార్యక్రమంలో ఆంగోత్ బాబు, మంగు నాయక్, ఇద్దయ్య, రంజిత్, రజిత. విజయలక్ష్మి, సుమలత, విజయ, ఆదివాసీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు బద్రి, తదితరులు పాల్గొన్నారు.

అసంబద్ధాలను తొలగించాలి

ఉపాధ్యాయుల బదిలీల, పదోన్నతుల విషయంలో ఉపాధ్యాయుల సీనియార్టీ లిస్టులో ఉన్న అసంబద్ధాలను తొలగించాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పులిచింతల విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలల్లో జరిగే బదిలీ, పదోన్నతుల పరిశీలన ప్రాంగణం వద్ద శుక్రవారం టీపీటీఎఫ్ జిల్లా నాయకులు నిరసన చేశారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా నాయకులు బలాష్టి రమేష్, ఎండి.సైదులు భాషా, సాయిబాబా, శ్రీనివాస్, ఐలయ్య, శ్రీనివాస్, రమేష్, రవీందర్, వెంకన్న పాల్గొన్నారు.



నిరసన చేస్తున్న సంఘం నాయకులు

అధికారులపై చర్య తీసుకోవాలి



మాట్లాడుతున్న భీమానాయక్

గూడూరు: మండలంలోని అధికారులు 1/70, పీసా చట్టాలను అమలు చేయకుండా దళారులకు పట్టం కడుతున్నారని, చట్టాలను ఉల్లంఘిస్తున్న అధికారులపై చర్య తీసుకోవాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుగులోతు భీమానాయక్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం సంఘం మండల అధ్యక్షుడు చందూనాయక్ అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అదే విధంగా ఎల్‌హెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో పలు సమస్యల పరిష్కారానికి ఫిబ్రవరి 5వ తేదీన జిల్లా మూడో మహాసభలు కురవి మండల కేంద్రంలో నిర్వహిస్తున్నామని, సభలకు గిరిజనులు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు వినోద్ నాయక్, జాటోతు మంగీలాల్, శ్రీకాంత్, వీర్నన, మంగు, బాల్య, వీరూనాయక్ పాల్గొన్నారు.

లోలెవల్ వంతెనకు మరమ్మతులు

మరిపెడ రూరల్: మరిపెడ మండలం తానంచర్ల -కోట్యాతండా గ్రామాల మధ్య ఉన్న పాలేరు వాగుపై గల లోలెవల్ వంతెనకు తాత్కాలిక మరమ్మతులను గంగమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రారంభించారు. గత ఏడాది వానాకాలం కురిసిన భారీ వర్షాల వరద ఉధృతికి లోలెవల్ బ్రిడ్జి పూర్తిగా ధ్వంసమై కొట్టుకుపోయింది. గంగమ్మ ఆలయంలో జాతరకు సమయం ఆసన్నమైంది. దీంతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో లోలెవల్ వంతెన తాత్కాలికంగా మట్టి పనులు చేపట్టి, ప్రజలు రాకపోకలు జరిగేలా దృష్టి సారించారు. ఈ కార్యక్రమంలో పూజారి లింగయ్య, నాయకులు ముఖేష్, రాంచంద్రారెడ్డి, ఉపసర్పంచ్ లింగస్వామి, వెంకన్న, రామయ్య, వీరన్న పాల్గొన్నారు.

ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

మహబూబాబాద్ రూరల్: కల్లుగీత కార్మికులకు రావాల్సిన పెండింగ్ ఎక్స్‌గ్రేషియాలు వెంటనే చెల్లించాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు యమగాని వెంకన్న, గౌని వెంకన్న అన్నారు. గీత కార్మికుల సమస్యలపై డీపీఈఓ కార్యాలయంలో శుక్రవారం జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి బి.కిరణ్‌నాయక్‌కు సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను డీపీఈఓ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వీరస్వామి, శ్రీనివాస్, శ్రీకాంత్, మధు, సోమయ్య, రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

'డయల్ యువర్ డీఎం'కు స్పందన

నెహ్రూసెంటర్: మహబూబాబాద్ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి స్పందన లభించిందని ఆర్టీసీ డిపో మేనేజర్ జె.విజయ్ తెలిపారు. డిపోలో శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించగా గూడూరు నుంచి కేసముద్రం, కేసముద్రం నుంచి తొర్రూరుకు బస్సు సర్వీసు కల్పించాలని ఆరు విజ్ఞప్తులు వచ్చాయన్నారు.

అదనపు లోడ్ చార్జీలను రద్దు చేయాలి

గార్ల: విద్యుత్ బిల్లుల్లో ఏసీడీ చార్జీలు, లోడ్ డెవలప్‌మెంట్ చార్జీలు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ గిరిజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం గార్ల సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి టీజీఎస్ మండల కార్యదర్శి బి.హరినాయక్ మాట్లాడారు. అనంతరం విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీజీఎస్ మండల అధ్యక్షుడు ఎం.శాంతికుమార్, ఎల్.శ్రీను, పూల్‌సింగ్, హరిసింగ్, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

గార్ల: మండలంలో మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను శుక్రవారం బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్‌నాయక్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు రుక్మిణీ, మాలోత్ జ్యోతి, నూనావత్ జ్యోతి పాల్గొన్నారు.

ఆర్థికసాయం

కేసముద్రం: మండలంలోని అర్పనపల్లి గ్రామానికి చెందిన సాహెబ్‌హుస్సేన్ అనారోగ్యంతో గురువారం రాత్రి మృతిచెందాడు. ఈమేరకు శుక్రవారం ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి, రూ.5వేల ఆర్థికసాయాన్ని అందజేశాడు.

మహబూబాబాద్ రూరల్: మండలంలోని అమనగల్ జిల్లా ప్రజాపరిషత్ పాఠశాల 10వ తరగతి విద్యార్థుల ప్రత్యేక తరగతుల నిర్వహణకు గాను అల్పాహారం కోసం వైస్ ఎంపీపీ ఎల్ది మల్లయ్య శుక్రవారం రూ.2వేల ఆర్థికసాయం అందజేశారు. సర్పంచ్ పూజారి మంగమ్మవెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా రాకేష్

నెల్లికుదురు: సోషల్ మీడియా మండల కోఆర్డినేటర్‌గా మండలంలోని వావిలాల గ్రామానికి చెందిన తవిశెట్టి రాకేష్‌ను నియమించినట్లు తెలంగాణ రాష్ట్ర సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా పెట్టం నవీన్, సెక్రెటరీ అంబాల శివకుమార్ శుక్రవారం తెలిపారు.

గ్రామసభను బహిష్కరించిన గ్రామస్తులు

గార్ల: మండలంలో అనేక పంచాయతీల్లో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలకు అధికారులు గైర్హాజరు కావడంతో గ్రామస్తులు గ్రామసభలను బహిష్కరించారు. గార్ల, చిన్నబంజర, రాంపురం, పంచాయతీల్లో నిర్వహించిన గ్రామసభలకు సైతం పంచాయతీ కార్యదర్శి, ఏఎన్‌ఎంలు తప్ప వేరే శాఖల అధికారులు ఎవ్వరూ హాజరు కాకపోవడంతో గ్రామసభలను తూతూ మంత్రంగా నిర్వహించి కార్యదర్శులు చేతులు దులుపుకున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి చర్యలు చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

జయప్రదం చేయండి

నెహ్రూసెంటర్: ఫిబ్రవరి 7, 8 తేదీలలో మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో జరిగే ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఊకే పద్మ, గుజ్జు కృష్ణవేణి అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు.

చర్యలు తప్పవు

చిన్నగూడూరు: విధులకు ఆటంకం కలిగిస్తే చర్యలు తప్పవని ఎస్సై బాదావత్ రవికుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎస్సై బాదావత్ రవి కుమార్ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేపట్టారు. తనిఖీలు నిర్వహిస్తుండగా ఇద్దరు వ్యక్తులు పోలీస్ సిబ్బందితో దురుసుగా ప్రవర్తించారు. ఈ మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

పోస్టులను భర్తీ చేయాలి

డోర్నకల్: మన్నెగూడెం జెడ్పీహెచ్‌ఎస్‌కు భాషా పండితుల పోస్టులను భర్తీ చేయాలని టీఎస్ యూటీఎఫ్ అబ్దుల్ అజీజ్ డిమాండ్ చేశారు. శుక్రవారం జరిగిన యూటీఎఫ్ మండల శాఖ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మన్నెగూడెం జెడ్పీహెచ్‌ఎస్‌లో నేటికీ పోస్టులు భర్తీ కాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే భాషా పండితుల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి శివప్రసాద్, సాహెబ్‌అలీ, విక్టోరియా, హచ్య పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

చిన్నగూడూరు: కంటివెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రోగ్రాం ఆఫీసర్ కరుణాకర్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రంలో శుక్రవారం కంటివెలుగు శిబిరం కొనసాగింది.

సౌండ్ సిస్టం బహూకరణ

మహబూబాబాద్ రూరల్: మండలంలోని అయోధ్య ఎంపీపీఎస్‌కు హర్షిత చారిటబుల్ ట్రస్ట్ నుంచి ప్రొఫెసర్ హెచ్చు రమణ, ప్రొఫెసర్ హెచ్చు వాసంతి రూ.24వేల విలువైన సౌండ్ సిస్టంను శుక్రవారం బహూకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ సత్యం, మాజీ సర్పంచ్ నాగన్న, కృష్ణా, ఎస్‌ఎంసీ చైర్మన్ నాగరాజు పాల్గొన్నారు.

సీఐ సేవలు ప్రశంసనీయం



డోర్నకల్: డోర్నకల్ సీఐ వెంకటరత్నం బాధ్యతలు స్వీకరించిన అనతికాలంలోనే విశిష్ట సేవలందించి గుర్తింపు పొందడం అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న తెలిపారు. గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ప్రశంస పత్రాన్ని అందుకున్న సీఐని శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో చైర్మన్ వీరన్నతోపాటు వైస్ చైర్మన్ కేశబోయిన కోటిలింగం ఘనంగా సన్మానించారు.

సన్మానం

తొర్రూరు: గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా జిల్లా కేంద్రంలో కలెక్టర్ శశాంక చేతుల మీదుగా అవార్డు అందుకున్న స్థానిక మైనారిటీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పసునూరి వనజను డివిజన్ కేంద్రంలో మైనారిటీ గురుకుల బాలికల పాఠశాల ఉపాధ్యాయ బృందం ఘనంగా సత్కరించారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి

మరిపెడ రూరల్: విద్యార్థులు కష్టపడి చదవి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని చిల్లంచర్ల కార్యదర్శి నూతక్కి శ్రీరామకృష్ణ అన్నారు. మరిపెడ మండలం చిల్లంచర్ల ఉన్నత పాఠశాలలో గత ఏడాది పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులను శుక్రవారం ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అమరేందర్‌రెడ్డి, సర్పంచ్ నూర్జహాన్ సత్తార్, మాజీ ఎస్‌ఎంఎస్ చైర్మన్ పిల్లల ధనుంజయ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

డోర్నకల్: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. డోర్నకల్ హెడ్ కానిస్టేబుల్ వీరస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దుబ్బతండాకు చెందిన అజ్మీరా బీమా(53) అనారోగ్య సమస్యలతో ఈనెల 21 పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

ఉప్పరిగూడెంలో చోరీ

కురవి: సీరోలు మండలం ఉప్పరిగూడెం గ్రామంలో తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగతనం జరిగిన సంఘటన శుక్రవారం వెలుగు చూసింది. ఎస్సై ఎల్.నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పరిగూడెం గ్రామానికి చెందిన కొత్త వీరన్న అనే వ్యక్తి ఈనెల 24వ తేదీన ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌కు కుటుంబసభ్యులతో వెళ్లాడు. 25న సాయంత్రం ఇంటికి వేసిన తాళం తీసి ఉండడాన్ని గమనించిన ఇంటి పక్క వ్యక్తి హైదరాబాద్‌లో ఉన్న వీరన్నకు సమాచారం అందజేశాడు. దీంతో వీరన్న వచ్చి ఇంట్లో ఉన్న రెండు తులాల బంగారు నగలు, 20 తులాల వెండి, రూ.40వేల నగదు పోయినట్లు ఫిర్యాదు చేయడం జరిగిందని ఎస్సై నరేష్ తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వివరించారు.

ద్విచక్ర వాహనం..

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని కృష్ణ కాలనీలో ద్విచక్ర వాహనం చోరీకి గురికాగా వాహన యజమాని కడుదుల కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని టౌన్ ఎస్సై బి.క్రాంతి కిరణ్ శుక్రవారం తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రంలో టీవీ..

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని శనిగపురం గ్రామంలో గల మోడల్ అంగన్‌వాడీ కేంద్రంలో ఈనెల 25వ తేదీ సాయంత్రం టీవీ చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు అంగన్‌వాడీ కేంద్ర భవనం తలుపు తొలగించి అందులో గల టీవీని ఎత్తుకెళ్లారు. అంగన్‌వాడీ టీచర్ పద్మ చోరీ సంఘటనపై మహబూబాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు శుక్రవారం తెలిపారు.

హార్డ్‌వేర్ దుకాణంలో..

మరిపెడ: మండల కేంద్రంలోని ఓ దుకాణంలో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగింది. జాతీయ రహదారిపై గల బాలాజీఐరన్, హార్డ్‌వేర్ షాపులో దొంగలు ఇంటి వెనుక వైపు నుంచి తలుపులు పగలగొట్టి దుకాణంలోకి ప్రవేశించారు. రూ.25వేలు అపహరించి, సీసీ కెమెరా హార్డ్‌డిస్క్ ఎత్తుకెళ్లారు. సంఘటనా స్థలానికి స్థానిక సీఐ సాగర్ చేరుకొని విచారణ చేపట్టారు.

సెల్‌ఫోన్ అప్పగింత

కురవి: మండల కేంద్రంలోని పెద్దచెరువు దగ్గర రోడ్డుపై దొరికిన సెల్‌ఫోన్‌ను కురవి రెండో ఎస్సై మధుబాబుకు అప్పగించిన సంఘటన శుక్రవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. కురవికి చెందిన దడిగెల రవి అనే వ్యక్తి సాయంత్రం జాతీయ రహదారిపై పెద్దచెరువు వద్దకు వాకింగ్‌కు వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో రోడ్డుపై సెల్‌ఫోన్ అతడికి దొరికింది. ఇదే సమయంలో రోడ్డుపై వాహనాలను ఎస్సై మధుబాబు తనిఖీ చేస్తున్నాడు. ఈమేరకు రవి తనకు దొరికిన సెల్‌ఫోన్‌ను, ఎస్సైకి అప్పగించి నిజాయితీ చాటుకున్నాడు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



పెద్దవంగర: మండల కేంద్రంలోని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కల్లుగీత కార్మిక సంఘం నూతన క్యాలెండర్లను ఏఎస్సై కుమారస్వామి చేతుల మీదుగా సంఘం మండల అధ్యక్షుడు అనపురం రవిగౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆవిష్కరించారు. సంఘం నాయకులు హరీశ్, వెంకన్న, అంజయ్య పాల్గొన్నారు.

టీఎన్జీఓఎస్ క్యాలెండర్..

మహబూబాబాద్: కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం టీఎన్జీఓఎస్ క్యాలెండర్‌ను కలెక్టర్ కె శశంక, అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీఎన్జీఓఎస్ జిల్లా అధ్యక్షుడు వడ్డెబోయిన శ్రీనివాస్, చారి, నాగరాజ్, రోహిత్, ఉషా, తదితరులు పాల్గొన్నారు.